TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 268 | సోమవారం, జూన్ 2, 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# పోలీసు సేవా పతకాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం..



## 11 మందికి శౌర్య పతకం



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సేవా పతకాలను ప్రకటిస్తూ హెూం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుశాఖలో పనిచేసే గ్రేహౌండ్స్‌కు చెందిన 9 మందికి శౌర్య పతకం దక్కింది. 16 మంది మహెూన్నత సేవా పతకం, 92 మంది ఉత్తమ సేవా పతకం, 47 మంది కఠిన సేవా పతకం, 461 మంది సేవా పతకం అందుకోనున్నారు. ఇక అవినీతి నిరోధక శాఖలో ఒకరికి మహెూన్నత సేవా, నలుగురికి ఉన్నత సేవా, 17 మందికి సేవా పతకాలు దక్కాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఒకరికి ఉత్తమ సేవా, ఐదుగురికి సేవా పతకాలు వచ్చాయి. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ శాఖలో ఇద్దరికి శౌర్య పతకం, ఒకరికి మహెూన్నత పతకం, ముగ్గురికి ఉత్తమ సేవా, 14 మందికి సేవా పతకాలు దక్కాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఒకరికి మహెూన్నత సేవా, ముగ్గురికి ఉత్తమ సేవా, 15 మందికి సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది.

## మావోయిస్టుల పేరుతో సాధారణ ప్రజలను కాల్చి చంపుతున్నరు:



2లో..

## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ తనిఖీలు..

### పాక్ గూఢచర్యంపై దర్యాప్తు వేగవంతం..!




2లో..

## సనాతన ధర్మాన్ని అపహాస్యం చేసే టీఎంసీ నేతలపై చర్యలేవీ..?: పవన్ కల్యాణ్



2లో..

# CMరేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ

## హైదరాబాద్‌లో ఇద్దరే ఉన్నరు..

హైదరాబాద్: జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ వెహికల్స్ టెండర్స్ వివాదంపై సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. జీహెచ్ఎంసీలోని 150 డివిజిన్లలో మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్ స్టంట్ రిపేర్ టీమ్స్‌కు సంబంధించిన పనులు చేపట్టేందుకు పిలిచిన టెండర్లలో స్థానిక కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోందని ఆమె లేఖ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

2లో..




## కాంగ్రెస్ ప్రభుత్వంలో


### అవినీతి వికేంద్రీకరణ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు.



2లో..

## విందులు, వినోదాల కోసమే అందాల పోటీలు పెట్టారు



2లో..

## బాలికపై సామూహిక అత్యాచారం..

### వీడియోతో బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ ఘోరం!



2లో..

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY
సోమవారం, జూన్ 2, 2025

# సంపాదకీయం

## లోకేశ్‌కు పట్టం

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొన్నదన్నట్టుగా ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడ్డ కార్యకర్తల్లో ప్రభుత్వంపై ఆశలు, ఆకాంక్షలు అధికంగా ఉన్నందున ప్రభుత్వంలో ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రతిస్పందన తీవ్రంగా ఉంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడానికి సైతం తెలుగు తమ్ముళ్లు వెనుకాడలేదు. దీనికితోడు కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలు ఇంకా అమలుకాకపోవడంతో ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడిందా? అన్న అనుమానం రాజకీయ పరిశీలకుల్లో కూడా ఏర్పడింది. ఇదంతా చూసి ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత మొదలైందని, నాలుగేళ్ల తర్వాత మళ్లీ అధికారం తనదేనని జగన్‌రెడ్డి ఆశలు పెంచుకుంటున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని కడప మహానాడు రుజువు చేసింది.

రాజకీయ పార్టీలు సమావేశాలు జరుపుకోవడం కొత్త కాదు. అయితే తెలుగుదేశం పార్టీ నిర్వహించుకునే మహానాడుకు ప్రత్యేకత ఉంటుంది. అది ఒక పార్టీ కార్యక్రమం మాత్రమే కాదు.. అదొక ఉద్విగ్నభరిత సన్నివేశం. తెలుగు ప్రజలతో విడదీయరాని బంధం కూడా. వేలాది మంది పార్టీ ప్రతినిధులతో క్రమం తప్పకుండా మహానాడును ఒక పండుగలా జరుపుకోవడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ మహానాడు నిర్వహణను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్నా, లేకపోయినా మహానాడును క్రమశిక్షణతో నిర్వహించగలగడం ఆ పార్టీ ప్రత్యేకత. పార్టీ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు గండిపేటలోని పార్టీ కార్యాలయం వద్ద మహానాడు నిర్వహించే వారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగేది. పెళ్లిళ్లు, పేరంటాలకు హాజరైనట్టుగా పార్టీ ప్రతినిధులు ముస్తాబై ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు. ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో నిర్వహించిన మహానాడుకు జాతీయ నాయకులు హాజరయ్యారు. నాటి కాంగ్రెస్ వ్యతిరేక శక్తులకు మహానాడు వేదికగా ఉండేది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం పార్టీ ప్రతినిధులకు ఒక అనుభూతిని మిగిల్చేది. పార్టీ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు, ప్రస్తుత పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆయనకు కుడి భుజంగా వ్యవహరిస్తూ మహానాడు నిర్వహణలో కీలక పాత్ర పోషించేవారు. తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు మూడో తరం ప్రవేశించింది. కడపలో నిర్వహించిన మహానాడు బాధ్యతను మూడవ తరానికి చెందిన లోకేశ్ చేపట్టారు. ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయింది. ముగింపు రోజున నిర్వహించే బహిరంగ సభకు జనం భారీగా హాజరవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు ఒంగోలులో నిర్వహించిన మహానాడు పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపగా, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు నిర్వహించిన మహానాడు ద్వారా కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారంలో నిజం లేదని, ప్రభుత్వంపై ప్రజల భరోసా సన్నగిల్లలేదని రుజువైంది. ప్రభుత్వం పట్ల సానుకూలత విషయం పక్కనపెడితే, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రజల్లో కోపం ఇంకా తగ్గలేదని మహానాడు ముగింపు సభ చెబుతోంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొన్నదన్నట్టుగా ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడ్డ కార్యకర్తల్లో ప్రభుత్వంపై ఆశలు, ఆకాంక్షలు అధికంగా ఉన్నందున ప్రభుత్వంలో ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రతిస్పందన తీవ్రంగా ఉంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడానికి సైతం తెలుగు తమ్ముళ్లు వెనుకాడలేదు. దీనికితోడు కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలు ఇంకా అమలుకాకపోవడంతో ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడిందా? అన్న అనుమానం రాజకీయ పరిశీలకుల్లో కూడా ఏర్పడింది. ఇదంతా చూసి ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత మొదలైందని, నాలుగేళ్ల తర్వాత మళ్లీ అధికారం తనదేనని జగన్‌రెడ్డి ఆశలు పెంచుకుంటున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని కడప మహానాడు రుజువు చేసింది. పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. అతి క్రియాశీలకంగా వ్యవహరించే కొద్ది మంది మాత్రం అతిగా వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతోంది. శాసనసభ్యులపై కార్యకర్తలకు కోపం ఉన్నప్పటికీ ఆ కోపం పార్టీ మీద కాదని రుజువైంది. కడప వంటి చోట మహానాడు నిర్వహించినా వసతులు ఉన్నాయా లేవా అని కూడా చూడకుండా వేలాది మంది కార్యకర్తలు తరలి రావడమే ఇందుకు నిదర్శనం. ముగింపు సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం హైలైట్. నిజానికి కడప జిల్లా నుంచి గెలిచిన ఎమ్మెల్యేలపై పార్టీ కార్యకర్తలు సంతృప్తిగా లేరు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. చంద్రబాబు మీద ప్రేమ తగ్గకపోయినా స్థానిక ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. అయితే మహానాడు విజయవంతం కావడానికి ఇవేమీ అడ్డు రాలేదు. ఇదే ఈ మహానాడు ప్రత్యేకత! ఈ మహానాడులో మరో మూడు నాలుగు ప్రత్యేకతలూ కనిపించాయి. కార్యకర్తల మనోభావాలను గుర్తించిన అధినేత చంద్రబాబు నాయుడు తన ప్రసంగంలో కోవర్టుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎన్నికల తర్వాత అప్పటి వరకు వైసీపీలో అధికారం చెలాయించి తమను ఇబ్బంది పెట్టినవారు ఇప్పుడు ఎమ్మెల్యేల చుట్టూ చేరి అధికారం చెలాయిస్తున్నారని కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారు. ఎమ్మెల్యేల పంచన చేరుతున్న కోవర్టుల కారణంగానే పల్నాడు జిల్లాలో ఇటీవల ఇద్దరు కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వచ్చింది. ఈ కారణంగానే ఒక పథకం ప్రకారం పార్టీలో చేరుతున్న కోవర్టుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన పార్టీ శాసనసభ్యులను పరోక్షంగా హెచ్చరించారు. ఈ సమస్యను అధిగమించడానికి ఎటువంటి చర్యలు చేపడతారో చూడాలి. అదే సమయంలో ఎమ్మెల్యేలను కట్టడి చేయవలసిన అవసరాన్ని ఈ మహానాడు గుర్తుచేస్తోంది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోవడానికి ఆయన మాత్రమే కారణం కాగా, ఇప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత అంటూ ఏర్పడితే అందుకు శాసనసభ్యులే ప్రధాన కారణం కాబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రజల్లో భరోసా సన్నగిల్లలేదు కనుక ప్రజలు ప్రస్తుతానికి సర్దిచెప్పుకొంటున్నారు. ఈ దశలో ఎమ్మెల్యేలను కట్టడి చేయని పక్షంలో దాని ప్రభావం పార్టీపై పడుతుంది. ఈ అంశాన్ని వక్తలు తమ ప్రసంగాల్లో ప్రస్తావించకపోయినా ఈ మహానాడు ద్వారా పార్టీకి అంతర్లీనంగా అందిన సందేశం ఇదే. కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా ప్రస్తుతానికి సానుకూలంగా ఉన్నారు. మిగతా నాలుగేళ్లు కూడా ఇదే సానుకూలత కొనసాగాలంటే పార్టీ నాయకత్వం కొన్ని విరుగుడు చర్యలు తీసుకోవాల్సిందే.

**రాటుదేలిన లోకేశ్!**

ఈ విషయం అలా ఉంచితే, ఈ మహానాడులో లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడవ తరం ప్రతినిధిగా పార్టీ బాధ్యతలు మోయగల శక్తియుక్తులు తనకు ఉన్నాయని ఆయన నమ్మకం కలిగించగలిగారు. మహానాడులో ప్రసంగించిన లోకేశ్‌ను నిశితంగా గమనిస్తే ఆయనలో మూర్తీభవించిన ఆత్మవిశ్వాసం కనిపించింది. గతంలో కొంత తొట్రుపాటు కనిపించేది. తెలుగు భాషపై అంతగా పట్టు కూడా ఉండేది కాదు. ఇటీవల ఢిల్లీలో కుటుంబ సభ్యులతో కలసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లోకేశ్ కలుసుకోవడం, ప్రధాని వారితో రెండు గంటలపాటు గడపటం తెలిసిందే. ఈ సందర్భంగా లోకేశ్‌కు కొన్ని సూచనలు చేయడంతో పాటు ఆయనలో తాను గమనించిన మార్పు గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. 'మీలో పరిణతి కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. మీ ప్రసంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మార్పును నేను గమనించాను. మొదట్లో తడబడిన మీరు ఇప్పుడు ఆసువుగా ఉపన్యసిస్తున్నారు' అని ప్రధాని మోదీ ప్రశంసించారు. అదే సమయంలో చంద్రబాబు నీడ నుంచి బయటపడి సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయాలని కూడా లోకేశ్‌కు ప్రధాని సూచించారు. ప్రధాని పరిశీలన నిజమే. గతంతో పోలిస్తే లోకేశ్ ఇప్పుడు రాటుదేలారు. నిజం చెప్పాలంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపన్యాసాలు ప్రజలను ఆకట్టుకొనే విధంగా ఉండవు. ఆయనకు అంతటి వాగ్ధాటి లేదు. 2019కి పూర్వం

## బాలికపై సామూహిక అత్యాచారం.. వీడియోతో బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ ఘోరం!

మొదటి పేజీ తరువాయి

బాలికను బ్లాక్‌మెయిల్ చేసి ఆరుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన దారుణ ఘటన బెళగావిలో చోటుచేసుకుంది.

బెళగావి: కర్ణాటకలోని బెళగావిలో 15 ఏళ్ల బాలికపై దారుణం చోటుచేసుకుంది. బాలికను బ్లాక్‌మెయిల్ చేసి ఆరుగురు వ్యక్తులు ఆమెపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు.. మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల క్రితం ఈ బాలిక స్నేహితుడు (నిందితుల్లో ఒకడు) బెళగావిలోని కొండ ప్రాంతానికి ఆమె తీసుకెళ్లాడు. అక్కడ సామూహిక అత్యాచారానికి ఒడిగట్టి.. ఈ దుశ్చర్యను ఫోన్‌లలో రికార్డు చేశారు. తమ మాట వినకపోతే ఆ వీడియోను ఆన్‌లైన్‌లో పెడతామంటూ బెదిరించి తాజాగా మరోసారి బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈసారి కూడా ఈ కిరాతక చర్యను రికార్డు చేసి బెదిరింపులు కొనసాగించారు. దీంతో బాలిక శనివారం పోలీసులను ఆశ్రయించడంతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశామని.. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మావోయిస్టుల పేరుతో సాధారణ ప్రజలను కాల్చి చంపుతున్నరు:

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: మావోయిస్టుల పేరుతో సాధారణ ప్రజలను కాల్చి చంపుతున్నారని టీజేఎస్ పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేసి కాల్పుల విరమణ ప్రకటించి సీపీఐ(మావోయిస్టు) పార్టీతో శాంతి చర్చలకు పూనుకోవాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం (జూన్ 1) శాంతి చర్చల(పీస్ డైలాగ్) కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, వామపక్ష, విప్లవ పార్టీలు, పౌర, మానవ హక్కుల, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. మావోయిస్టులపై జరుగుతున్న దాడులు నిలిపివేసేందుకు చర్చలు జరగాలన్నారు. సామాజిక, ఆర్థిక అవసరాల నేపథ్యంలో జరుగుతున్న పోరాటాలను శాంతి చర్చలతో పరిష్కరించుకోవాలని సూచించారు.

సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు చర్చలు జరపాలని అన్నారు. కేంద్రం, మావోయిస్టులు శాంతియుతంగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. మావోయిస్టులతో శాంతి చర్చల కోసం పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం దండకారణ్యంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్ ఆపి కాల్పుల విరమణ ప్రకటించి.. కేంద్రం, మావోయిస్టులు శాంతి చర్చలు జరపడానికి మద్దతిస్తున్నామన్నారు.

## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ తనిఖీలు..

### పాక్ గూఢచర్యంపై దర్యాప్తు వేగవంతం..!

మొదటి పేజీ తరువాయి

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దేశవ్యాప్తంగా 15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. వీటిల్లో దిల్లీ, ముంబయి, హరియాణా, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులకు చెందిన నివాస గృహాలు, ఆఫీస్‌లు వీటిల్లో ఉన్నాయి.

ఈ దాడుల సందర్భంగా పలు ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా సీజ్ చేశారు. కొన్ని సున్నితమైన ఆర్థిక పత్రాలు కూడా జాతీయ దర్యాప్తు సంస్థకు దొరికాయి. పాకిస్థాన్ నుంచి గూఢచర్యం రాకెట్‌ను నడిపిస్తున్న ఆపరేటివ్‌ల సమాచారాన్ని తెలుసుకోవడానికి వీటిని విశ్లేషిస్తామని అధికారులు వెల్లడించారు. గూఢచర్యానికి అవసరమైన ఆర్థిక సహకారాలు వీరి నుంచి అందినట్లు తాము అనుమానిస్తున్నామన్నారు.

మే 20 తేదీన జాతీయ దర్యాప్తు సంస్థ ఓ వ్యక్తిని అరెస్టు చేసింది. అతడు 2023 నుంచి పాక్‌కు సున్నితమైన సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నట్లు గుర్తించారు. వీటిల్లో జాతీయ భద్రతకు ముప్పుగా మారే అంశాలు కూడా ఉన్నాయి. అతడికి భారత్‌లోని పలువురు వ్యక్తుల నుంచి నిధులు అందేవి.

ఇప్పటికే ప్రముఖ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా పలువురిని గూఢచర్యం కేసులో దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. ఈ క్రమంలో కాసిం అనే వ్యక్తిని అరెస్టు చేశారు. సున్నితమైన సమాచారాన్ని అతడు పాకిస్థాన్‌కు చేరవేసినట్లు తెలుస్తోంది.

## సనాతన ధర్మాన్ని అపహాస్యం చేసే టీఎంసీ నేతలపై చర్యలేవీ..?: పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ సిందూర్ సమయంలో అభ్యంతరకర పోస్టు పెట్టిన ఇన్‌ఫ్లూయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలీని కోల్‌కతా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ప్రస్తుతం ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై తాజాగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. ఈ సందర్భంగా సనాతన ధర్మాన్ని అపహాస్యం చేస్తూ మాట్లాడే టీఎంసీ ఎంపీలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సనాతన ధర్మంపై మాట్లాడిన వీడియోను పవన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ ఒక వీడియో పోస్టు చేసింది. తన మాటలు కొంత మందికి బాధ కలిగించేవిగా ఉన్నాయని గ్రహించిన ఆమె.. దాన్ని తొలగించి, క్షమాపణలు కూడా చెప్పింది. పశ్చిమ బెంగాల్ పోలీసులు అత్యంత వేగంగా స్పందించి ఆమెపై చర్యలు తీసుకున్నారు. కానీ, సనాతన ధర్మాన్ని అపహాస్యం చేస్తూ కోట్లాది మంది బాధకు కారణమైన అక్కడి నాయకులు, టీఎంసీ ఎంపీల సంగతి ఏంటి? వారి వ్యాఖ్యలకు క్షమాపణలు ఎక్కడ?వారిని ఎందుకు అరెస్టు చేయలేదు? దైవదూషణను ఎప్పుడూ ఖండించాలి. లౌకికవాదం రెండు వైపులా ఉండాలి. ఇది కొందరికి కవచం.. మరికొందరికి ఖడ్గం కాకూడదు. పశ్చిమ బెంగాల్ పోలీసులు అందరిపట్ల ఒకేలా వ్యవహరించాలి" అని పవన్ రాసుకొచ్చారు.

పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌పై స్పందించని బాలీవుడ్ నటులను ఉద్దేశిస్తూ శర్మిష్ఠ సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్టు చేసింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో వెంటనే తొలగించి క్షమాపణలు కోరింది. ఈక్రమంలోనే ఆమెపై

## కాంగ్రెస్ ప్రభుత్వంలో

### అవినీతి వికేంద్రీకరణ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, భాజపా ప్రభుత్వానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులకు వర్క్‌షాప్ నిర్వహించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన, అంతర్జాతీయ యోగాదినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ, వ్యవసాయానికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలు, రాష్ట్రంలో అకాలవర్షాల వల్ల జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానంగా చర్చ జరిగింది.

కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల వద్దకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనను వివరించాలని పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలిపారు. భారాస, కాంగ్రెస్ రెండూ కలిసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని, తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి వికేంద్రీకరణ జరిగిందని, భారాస ప్రభుత్వంలో అవినీతి కేంద్రీకృతం అయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళు తున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. భాజపా తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఏ పార్టీ కాపాడలేదని, అందుకే ప్రజలు భాజపా వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు, భారాస అవినీతిని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.

## CMరేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ

మొదటి పేజీ తరువాయి

ఈ పనులు చేపట్టేందుకు గతంలో కేవలం ఐదు నెలల కోసం టెండర్లు పిలువగా, ఈసారి మూడేళ్ల కాలపరిమితికి టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. ఈ పనులు చేపట్టేందుకు వినియోగించే వాహనాల్లో కొన్ని స్పెసిఫికేషన్స్ ఉండాలనే నిబంధనలు పెట్టారు. కానీ ఆ స్పెసిఫికేషన్స్ ఉన్న వాహనాలను విక్రయించే డీలర్లు హైదరాబాద్‌లో కేవలం ఇద్దరే ఉన్నారని అన్నారు.

టెండర్లలో పాల్గొన్న స్థానిక కాంట్రాక్టర్లకు ఆయా డీలర్లు వాహనాలు సరఫరా చేసేందుకు సమ్మతి ఇవ్వకపోవడంతో వారు కర్నాటక డీలర్ల నుంచి ఎన్‌వోసీ తీసుకొని టెండర్లలో పాల్గొన్నారు. ఆ కాంట్రాక్టర్లకు ఎంవోయూకు సంబంధించిన ఫిజికల్ కాపీలు సమర్పించడానికి జీహెచ్‌ఎంసీలోని కొందరు అధికారులు తగినంత సమయం ఇవ్వడం లేదని.. తద్వారా వారిని టెండర్లలో డిస్ క్వాలిఫై చేసి తాము ముందే ఒప్పందం కుదుర్చుకున్న రెండు సంస్థలకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు.

ఈ పనుల కోసం గతంలో వినియోగించిన వాహనాల ద్వారా రెండు, మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్ తరలించే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు జీహెచ్‌ఎంసీ జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న స్పెసిఫికేషన్స్ ఒక విదేశీ కంపెనీకి చెందిన వాహనాలకు మాత్రమే ఉన్నది. ఆ వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్ కూడా తరలించడం సాధ్యం కాదని మీడియాలో కథనాలు వచ్చాయని తెలిపారు.

కేవలం ఆ కారణంతోనే ఒక ఏడాదికి గతంలో రూ.5.40 కోట్లు అయ్యే వ్యయం రెట్టింపు కన్నా ఎక్కువగా పెరిగి రూ.11.25 కోట్లకు చేరింది. అంటే ఏటా రూ.5.85 కోట్ల ప్రజాధనం అధనంగా ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.మున్సిపల్ శాఖను కూడా మీరే చూస్తున్నందున మీ శాఖ పరిధిలోని జీహెచ్‌ఎంసీ టెండర్లలో తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్ స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గతంలో మాదిరిగా వార్డుల వారీగా మళ్లీ టెండర్లు పిలిస్తే 150 మంది కాంట్రాక్టర్లకు ఉపాధి కలుగుతుందన్నారు.

దీనికి విరుద్ధంగా జీహెచ్‌ఎంసీ జోన్‌ల వారీగా టెండర్లు పిలవడంతో తొమ్మిది టెండర్లు మాత్రమే దాఖలు చేసే అవకాశం లభించింది. ఈ తొమ్మిది టెండర్లను కేవలం రెండు సంస్థలకే కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ టెండర్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగానికి ప్రయత్నిస్తోన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## విందులు, వినోదాల కోసమే అందాల పోటీలు పెట్టారు

మొదటి పేజీ తరువాయి



సిద్దిపేట: జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో ఏర్పాటు చేసిన భారాస కార్యాలయాన్ని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

"అందాల పోటీలకు రూ.200కోట్లు ఖర్చు పెట్టారు. అనుచితంగా ప్రవర్తించినట్టు మిస్ ఇంగ్లాండ్ ఆరోపించారు. విందులు, వినోదాల కోసమే అందాల పోటీలు పెట్టారు. ఆ పోటీల వల్ల రాష్ట్రానికి చెడ్డ పేరు మాత్రమే. మూసీ పునరుద్ధరణ, హైడ్రా అని అన్నీ వదిలేశారు. రాజీవ్ యువశక్తి పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకే లబ్ధి చేకూరుతుంది. ఉద్యమ సమయంలో ఎంతో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారు. ఇదేనా రేవంత్‌రెడ్డి తెచ్చిన మార్పు? కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటున్నారు. రైతు బంధు, కల్యాణ లక్ష్మి, జిల్లాకో మెడికల్ కాలేజీ ఇచ్చారు.. రద్దు చేస్తారా? అద్భుతమైన సచివాలయం కట్టారు అది తీసేస్తారా? 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అది తొలగిస్తారా? దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి" అని హరీశ్‌రావు విమర్శించారు.

# శ్రీ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కళ్యాణమహోత్సవము

### పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,భేరి రామ్ చందర్ యాదవ్ పాల్గొన్నారు

శేరిలింగంపల్లి నియోజకవర్గ గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం లో కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం. గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో కళ్యాణ మహోత్సవం పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. జాతర అంగరంగ వైభవంగా వైభవోపేతంగా జరిగింది. శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం పూజా కార్యక్రమాలు జాతర స్వామివార్ల ఊరేగింపు భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణం వేడుక ఘనంగా వైభవోపేతంగా బ్రాహ్మణోత్తము లచే కళ్యాణం చూడముచ్చటగా జరిపించారు. కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ అందరికీ ఆహ్వానిస్తూ వచ్చిన పెద్దలకు నాయకులకు శాలువాలతో సత్కరించి కళ్యాణానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలియ జేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ గౌడ్ ఈ కళ్యాణోత్సవానికి హాజరు కావడం జగదీశ్వర్ గౌడ్ సన్మానించడం వేడుకగాని జరిగింది.శేర్లింగంపల్లి ప్రజలకు నల్లగండ్ల ప్రజలకు సంతోషదాయకం. ప్రతి సంవత్సరం ఇలాగే భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం వైభోపేతంగా జరుపుకోవడం ఆనంద్ దాయకమని జగదీశ్వర్ గౌడ్ దంపతులను అభినందించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు అభిమానులు



కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది. బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భ్రమరాంబ మల్లికార్జున స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని జగదీశ్వర్ గౌడ్ ప్రతి సంవత్సరం కళ్యాణోత్సవం చేయడం సంతోషిదాయకమని దంపతులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ గౌడ్ కూడా పాల్గొనడం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున శేరిలింగంపల్లి ప్రజలకు కూడా ఆనందం బేరి రామ్ చందర్ యాదవ్ మాట్లాడుతూ.... ముఖ్యంగా హిందూ ధర్మాన్ని పాటించే ప్రజలందరూ ఆధ్యాత్మికంగా దేవదేవతలను పూజించేవారు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ భగవంతుని దర్శించుకుంటూ ఆశీర్వాదం తీసుకోవడం గొప్పగా ఉంటుందని మనశ్శాంతిగా ఉండటానికి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని తమ వంతు సహకారం నిర్వహకులకు అందిస్తున్నందుకు బేరి రామచందర్ యాదవ్ మరొకసారి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్ దంపతులు ఉద్దేశించి హృదయపూర్వకంగా అభినందించారు. నల్లగండ్ల ప్రజలు గచ్చిబౌలి డివిజన్లోని ప్రజలతోపాటు శేరిలింగంపల్లి అభిమాన గణం నాయకులు కార్యకర్తలు పాల్గొనడం విశేషం.



ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు అనేక మంది పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని జగదీశ్వరి గౌడ్ దంపతులను సన్మానించారు. మాజీ కౌన్సిలర్లు ముఖ్య నాయకులు, సునీత ప్రభాకర్ రెడ్డి వారి బృందం పాల్గొని పూజా కార్యక్రమాల్లో నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, జయా రెడ్డి, ఎన్ ఎన్ రెడ్డి టెక్స్టైల్స్ బోటిక్ ప్రొప్రైటర్ కుషన్ రెడ్డి, అందిన కిరణ్ యాదవ్ బేరి చంద్రశేఖర్ యాదవ్, యువజన నాయకులు రాజు, లవణాచారి, కాలనీ పెద్దలు మహిళా సోదరులు యోజన నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## మున్నూరు కాపుల వనభోజనం ఆత్మీయ సమ్మేళనం



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 01 :** ప్రతియేటా గోల్ హనుమాన్ మున్నూరు కాపు పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే పోచమ్మ పండుగ వనభోజనాలను సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం వేకువజామున సభ్యులందరు డప్పు చప్పులతో పోచమ్మ తల్లి వద్దకు ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి బోనం సమర్పించి గ్రామ ప్రజలందరూ చల్లగా ఉండాలని పాడిపంటలు మంచిగా పండి సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులందరు పిల్లపాపలు కుటుంబసభ్యులు అందరూ ఒక దగ్గరకు చేరి పూజలు చేసి సామూహిక భోజనాలు చేసి ఆడి పాడారు. ఇట్టి కార్యక్రమంలో సంఘ సభ్యులందరు కుటుంబాలతో సహా పాల్గొన్నారు.

## మోదీ పాలనలో దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి

### - సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి




**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 01:** మోడీ 11 ఏళ్ల పాలన లలో దేశంలో ఆర్థిక అసమానతలు మునుపెన్నడూ లేని విధంగా విపరీతంగా పెరిగిపోయాయని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు సిపిఐ చిన్నగూడూరు మండల మూడవ మహాసభ మండల కేంద్రంలో జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆదాని అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు దాసోహమై ప్రజల సంపదను దోచుపెడుతూ ఒక్క శాతం ధనవంతుల చేతిలో 45 శాతం సంపద కేంద్రీకృతమై ఆకలి దారిద్రం నిరుద్యోగిత అనారోగ్యం మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోయాయని ఆరోపించారు

సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు

సిపిఐ మండల కార్యదర్శి గా మూడవసారి గంజి శేషాద్రి రెడ్డి సహాయ కార్యదర్శిగా దొంతు స్టాలిన్ లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది

ఈ మహాసభ లో సిపిఐ సీనియర్ నాయకులు రామడుగు బ్రహ్మం, పోలేపాక వెంకన్న, ఉగ్గుల వెంకన్న, కందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల భూమిపూజ కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి కి పాలాభిషేకం చేసిన - ఆవుల రాజిరెడ్డి

హత్నూర మండలం మండలంలోని ఎల్లమ్మగుడా మరియు వడ్డేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో పేదల చిరకాల కోరికను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల కృతజ్ఞతగా, వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీ ఆవుల రాజిరెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రాష్ట్రంలో గృహ నిర్మాణాల కలను నిజం చేస్తూ, పేదలకు నిజమైన న్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఇది కేవలం నిర్మాణం కాదు, ఇది పేదల గౌరవానికి నిదర్శనం,”



అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం పునఃప్రారంభం కావడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది పేద కుటుంబాలకు ఆదరణ లభించనున్నదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం



ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

## ఆయన మరణం కూడా ఆదర్శవంతమైనదే

### - పోతినేని సుదర్శన్



**పినపాక (మన వెలుగు) జూన్ 01 :** అశ్వాపురం మండలం సీతారాంపురం గ్రామంలో సిఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధు తండ్రిగారైన కీర్తిశేషులు రామిరెడ్డి సమస్మరణ సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టిన బలుగూరి రాంరెడ్డి బతికినంత కాలం ఉన్నత భావాలతో జీవించారని చనిపోయిన తర్వాత కూడా ఆయన మృతదేహాన్ని మెడికల్ కాలేజ్ కి ఇచ్చి విద్యార్థుల మేధో శక్తిని పెంచడం కోసం ఉపయోగపడ్డారంటే వారు అత్యున్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. వారి కుమారుడు బలుగూరి మధు కమ్యూనిస్టు పార్టీలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగారంటే వారి వెనకాల వారి తండ్రిగారైన కీర్తిశేషులు రాంరెడ్డి ప్రోత్సాహం ప్రోత్బలం ఎంతో ఉందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొని బలుగూరి రాంరెడ్డి సేవలను కొనియాడారు


## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిపిద్దాం..!

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గనేమోని శ్రీనివాస్



నేడు జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ప్రజా భవన్( ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయం) లో తెలంగాణ రాష్ట్ర ఆవి ర్భావ దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి చేతులమీదుగా 8 గంటల 30 నిమిషాలకు జాతీయ పతావి ష్కరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గనేమోని శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. కావున ఈ కార్యక్రమ ములో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ , కార్యకర్తలు తది తరులు పాల్గొనగలరని మనవి.

## మాడాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ మరియు మహాత్మ గాంధీ గారి విగ్రహాని ఆవిష్కరించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజి రెడ్డి



నర్సాపూర్ మండలంమాదాపూర్ గ్రామంలో ఈ సందర్బంగా మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సన్మార్గంలో నడుస్తూ భవితరానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. గాంధీ గారి సత్యం మరియు అహింస సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ గౌరవించి, ఆ మార్గంలో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలే కాబట్టి, గ్రామాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత మన అందరి మీద ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చే పార్టీగా ప్రజల



మద్దతుతో ముందుకు సాగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపీపీ లలిత నర్సింగ్,నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేష్, నర్సాపూర్ PACSC చైర్మెన్ రాజు యాదవ్, మాజీ ఎంపిటిసి అశోక్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి తరుణ్, నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, దాడిగా నరేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు, NSUI నాయకులు,గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కుల్కచర్ల మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బచ్చి రెడ్డి మహబూబ్ నగర్ లో నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ భూమన్న గారి పరశురాం రెడ్డి ,పరిగి మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షులు తౌరియా నాయక్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి , దామోదర్ రెడ్డి , తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియ జేయడం జరిగింది.

## నేటి ప్రజావాణి కార్యక్రమం వాయిదా



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 01 :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల నేపథ్యంలో నేడు (సోమవారం) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. తిరిగి జూన్ 09వ తేదీ నుండి ప్రతీ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 01 :** పట్టణంలోని ఆరపేట శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ వారి వద్ద నుండి రూ.13,570 నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

# ఎందాకా వచ్చింది..
## మన సొంత విమానం తయారీ?



విమానాల తయారీలో బోయింగ్ (అమెరికా), ఎయిర్‌బస్ (ఐరోపా) ప్రపంచంలోనే అగ్రగామి సంస్థలుగా కొనసాగుతున్నాయి. 90% మార్కెట్ వాటా ఈ సంస్థలదే. ఎంబ్రాయర్ (బ్రెజిల్) కూడా కొంతమేర మార్కెట్‌ను పొందింది. పొరుగుదేశమైన చైనా కూడా గతేడాది సొంత విమానాన్ని ఆవిష్కరించింది. దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ పరంగా ప్రపంచంలో మూడోస్థానానికి చేరిన మనదేశం నుంచి 1200 కొత్త విమానాలకు ఆర్డర్లు వెళ్లాయి. రాబోయే 20 ఏళ్లలో మన రద్దీకి 2,200 కొత్త విమానాలు అవసరమని అంచనా. ఈ నేపథ్యంలోనే సొంతంగా వాణిజ్య విమానం తయారు చేసేందుకూ ప్రయత్నాలు జరుగుతున్నాయి. టాటాలు తయారు చేస్తున్న హెచ్125 హెలికాప్టర్ ఈ ప్రక్రియలో భాగంగానే చూడాలి.

ఎయిర్‌బస్‌తో కలిసి ఎయిర్‌బస్‌తో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) కర్ణాటకలోని కోలార్ వద్ద హెచ్125 హెలికాప్టర్లకు ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటిదాకా వీటి తయారీ ఫ్రాన్స్, అమెరికా, బ్రెజిల్‌లోనే జరుగుతోంది. ఇపుడు నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఈ హెలికాప్టర్లను ప్రయాణికుల రవాణా, అత్యవసర/వైద్య సేవలకు వినియోగించొచ్చు. ఇంతకుముందు మిలటరీ అవసరాల కోసం గుజరాత్‌లో హెలికాప్టర్ ప్లాంటును ఈ సంస్థలు నెలకొల్పాయి.

హెచ్ఏఎల్ కూడా: వాణిజ్య విమానాలను దేశీయంగా తయారు చేయాలంటే ఎంతో అనుభవం, సాంకేతిక నైపుణ్యాలు అవసరం. ఇందుకు ముందస్తు సన్నాహకంగా హెచ్125 హెలికాప్టర్ తయారీని చెప్పుకోవచ్చు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, మనదేశంలో ఫైటర్ జెట్‌లను తయారు చేయడం ప్రారంభించింది. 19 సీట్ల పౌర విమానాన్ని తయారు చేసేందుకూ ప్రయత్నిస్తోంది.

చైనా కొమాక్ సీ919 విమానం: దశాబ్దాల పాటు కష్టపడి, చైనా తన తొలి వాణిజ్య విమానం (కొమాక్ సీ919)ను గతేడాది ఆవిష్కరించింది. విదేశాలకూ ఈ విమానాలను విక్రయించాలన్నది ఆ దేశ యత్నం. ఎయిర్‌బస్ ఏ320 నియో, బోయింగ్ 737 మ్యాక్స్8లకు పోటీగా దీన్ని రూపొందించింది. అయితే అంతర్జాతీయ ధ్రువీకరణల విషయంలో ఆ విమానం వెనకబడే ఉంది. కొమాక్ తయారీకి పాశ్చాత్య దేశాల సాంకేతికతపై ఆధారపడడం మరో లోటు.

మనం ఎలా?: విమాన తయారీ కోసం చైనా దశాబ్దాల కిందటే ప్రయత్నాలు మొదలుపెట్టి, గత ఏడాదికి విడుదల చేసింది. మనదేశం ఇటీవల కాలంలోనే ఈ దిశగా అడుగులు వేస్తోంది. భారత్ త్వరలోనే పౌర విమానాల తయారీలోకి అడుగుపెడుతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు గతేడాది పేర్కొన్నారు. కీలక విడిభాగాలు, ఇంజిన్లను విదేశీ సంస్థల నుంచే దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందని, క్రమంగా సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

అంత సులువు కాదు: దేశీయంగా వాణిజ్య విమాన తయారీ అత్యంత సంక్లిష్ట అంశమే. అయితే బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు ఇప్పటికే మన దేశంలో పరిశోధన, సాంకేతికత, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం కలిసొచ్చే అంశం. ఆ కంపెనీలకు కొన్ని విడిభాగాలను మనదేశం పంపుతోంది. అయితే అంతర్జాతీయ సరఫరాలో మనదేశ వాటా 5 శాతంగానే ఉంది అంటే, ఇంకా ఆరంభంలోనే ఉన్నాం.

**1,200 విమానాలు**
భారత కంపెనీలు ఆర్డర్లు పెట్టిన విమానాల సంఖ్య

**2,200**
వచ్చే 20 ఏళ్లకు మనకు కావాల్సిన కొత్త విమానాల సంఖ్య

విమాన తయారీ అంటే అత్యంత కీలక, సంక్లిష్ట విడిభాగాలు, అత్యాధునిక సాంకేతికతతో పాటు భారీ పెట్టుబడులూ అవసరం. 2008–2020 మధ్య చైనా తన సీ919 అభివృద్ధికి 49–72 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.16–6.12 లక్షల కోట్ల) పెట్టుబడులు పెట్టిందని ఒక అంచనా. ఇంత సమకూర్చుకున్నా, అంతర్జాతీయ దిగ్గజాలతో సానుకూల భాగస్వామ్యం ఉంటేనే, దేశీయంగా వాణిజ్య విమానాల తయారీ కల నెరవేరుతుంది.

# టాటా హారియర్,
## మహీంద్రా ఎక్స్‌ఈవీ




దేశంలో ఎస్‌యూవీలకు ఆదరణ పెరుగుతోంది. దీంతో ప్రధాన వాహన తయారీ సంస్థలు వివిధ రకాల సౌకర్యాలతో కూడిన ఎస్‌యూవీలను తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ ఏడాది అలా కొన్ని కొత్త మోడళ్లు, సరికొత్త అప్‌గ్రేడ్‌లతో కూడిన ఎస్‌యూవీలు మార్కెట్లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ఆ వివరాలు ఇవీ..

**టాటా హారియర్ ఈవీ**

టాటా మోటార్స్‌కు చెందిన హారియర్ ఈవీ ఈ నెలలోనే రాబోతోంది. మెరుగైన ఇంటీరియర్ స్పేస్, అద్భుతమైన ఫీచర్లతో దీన్ని తీసుకురానున్నారు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ రేంజ్ ఇస్తుందని అంచనా. డ్యూయల్–మోటార్ ఆల్–వీల్ డ్రైవ్, మల్టీ–లింక్ రియర్ సస్పెన్షన్ సిస్టమ్‌తో వచ్చే అవకాశం ఉంది. స్పెసిఫికేషన్లు రివీల్ చేయనప్పటికీ జూన్ 3న మార్కెట్లో విడుదల చేయనున్నారు.

**మారుతీ సుజుకీ ఇ-విటారా**

మారుతీ సుజుకీ తొలి ఎలక్ట్రిక్ వాహనం ఇ- విటారా కూడా ఈ నెలలో రానుంది. హ్యుందాయ్ క్రెటా ఈవీ, ఎంజీ జెడ్ఎస్ ఈవీ, మహీంద్రా బీఈ 6 వంటి కార్లతో పోటీ పడనుంది. 49 kWh, 61 kWh రెండు బ్యాటరీ ఎంపికలతో రానుంది. 500 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది.

**హ్యుందాయ్ వెన్యూ ఫేస్‌లిఫ్ట్**

కాంపాక్ట్ ఎస్‌యూవీ అప్‌డేటెడ్ వెర్షన్‌యే హ్యుందాయ్ వెన్యూ ఫేస్‌లిఫ్ట్. సరికొత్త డిజైన్‌తో తీసుకొస్తున్నారు. ఫీచర్ల వివరాలు ప్రకటించలేదు. టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ, స్కోడా కైలాక్, మారుతీ సుజుకీ బ్రెజ్జా, కియా సోనెట్ వంటి మోడళ్లతో పోటీ పడనుంది.

**మెర్సిడెస్ -ఏఎంజీ జీ63 కలెక్టర్ ఎడిషన్**

ఏఎంజీ జీ63 ప్రత్యేక వెర్షన్ 'కలెక్టర్స్ ఎడిషన్'ను మెర్సిడెస్ బెంజ్ జూన్ 12న పరిచయం చేయనుంది. ఈ ఎస్‌యూవీ వేరియంట్ ప్రత్యేకంగా భారత మార్కెట్ కోసం రూపొందించారు. వైబ్రెంట్ కలర్, సిల్వర్ వీల్స్‌తో తీసుకొస్తున్నట్లు తాజాగా రివీల్ చేసిన టీజర్ చూస్తే తెలుస్తోంది. 4.0 లీటర్ టర్బో వీ8 ఇంజిన్ 577 hp, 850 Nm టార్క్ ఉత్పత్తి చేస్తుంది.

**మహీంద్రా ఎక్స్‌ఈవీ 7ఈ**

XUV700 తరహా డిజైన్‌తో మహీంద్రా ఎక్స్‌ఈవీ 7ఈ రానుంది. దీని గురించి పూర్తి వివరాల్ని కంపెనీ ఇంకా వెల్లడించలేదు. అయితే 59 kWh, 79kWh బ్యాటరీ ఆప్షన్లతో తీసుకురానున్నట్లు తెలుస్తోంది. సింగిల్ ఛార్జ్‌తో 500 కిలోమీటర్లు రేంజ్ ఇస్తుంది. ఈ ఏడాది ముగిసేలోపే మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనుంది.

# క్విక్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి
# బిగ్‌బాస్కెట్ ఎంట్రీ

బిగ్‌బాస్కెట్ క్విక్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి అడుగు పెట్టింది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా బెంగళూరులోఈ సేవల్ని ప్రారంభించింది.

: టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ గ్రాసరీ డెలివరీ సంస్థ బిగ్‌బాస్కెట్ తన సేవల్ని విస్తృతం చేస్తోంది. అందులో భాగంగా క్విక్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి అడుగు పెట్టింది. బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లో 10 నిమిషాల ఫుడ్ డెలివరీ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది.

టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్, స్టార్ బక్స్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించే స్టార్ బక్స్, ఇండియన్ హొటల్స్ కంపెనీ లిమిటెడ్ కు చెందిన క్యూమిన్ నుంచి ఆహార పదార్థాల్ని బిగ్‌బాస్కెట్ క్విక్ డెలివరీ చేయనుంది. ఇందులో కాఫీ, టీ, జ్యూస్, స్నాక్స్, మీల్ బౌల్స్, డెసర్ట్స్ వంటివి ఉన్నాయి. క్యూమిన్ అనేది టాటా సన్స్‌కు చెందిన ఇండియన్ హొటల్స్ కంపెనీ లిమిటెడ్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్. టాటా యాజమాన్యంలోని హొటళ్లు, రెస్టరంట్ల నుంచి ఆహారాన్ని ఆర్డర్ చేసేందుకు తీసుకొచ్చిన యాప్. 2020లో ఈ సేవల్ని ప్రారంభించారు. బేకరీ పదార్థాల కోసం క్యూమిన్ కేఫ్ కూడా అందుబాటులోకి తెచ్చారు.

టాటా హారియర్, మహీంద్రా ఎక్స్‌ఈవీ 7ఈ.. త్వరలో రాబోయే ఎస్‌యూవీలు ఇవే!

క్విక్ ఫుడ్ డెలివరీ విభాగంలో జెప్టో (జెప్టో కేఫ్), స్విగ్గీ (స్నాక్), బ్లింకిగ్ (బిస్ట్రో) వంటి సంస్థలు తమ సేవల్ని విస్తరిస్తున్నాయి. 10 మినిట్స్ డెలివరీలు అందిస్తూ ఈ విభాగంలో ఉన్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నాయి. అంతేకాదు మార్కెట్లో తమ వాటా పెంచుకునేందుకు ఈ విభాగంలో పెట్టుబడుల్ని పెంచుతున్నాయి. విస్తరణ దశలో భాగంగా దిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబయిలో 100కు పైగా కిచెన్‌లను బిస్ట్రో నడుపుతోంది.



మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
సోమవారం, జూన్ 2, 2025

# నెక్స్ట్ టైమ్.. ప్రభాస్ మూవీపై రివ్యూ ఇస్తా: ప్రపంచ సుందరి



108 దేశాల అందగత్తెలను వెనక్కి నెట్టి ప్రపంచ సుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు థాయ్‌లాండ్ భామ ఓపల్ సుచాత. మిస్ వరల్డ్ 2025గా విజయం సాధించిన అనంతరం ఆమె జాతీయ మీడియాతో ముచ్చటించారు. భారతీయ సినిమాల గురించీ మాట్లాడారు. తనకు బాలీవుడ్ నటి అలియాభట్ తెలుసన్నారు. ఈ ప్రయాణంలో ఎంతో మంది సుందరీమణులు తనలో స్ఫూర్తి నింపారని చెప్పారు.భారత దేశం నుంచి ప్రపంచ సుందరిగా విజయాన్ని అందుకున్న వారిలో ఎవరంటే మీకు ఇష్టం అని ప్రశ్నించగా.. "ఈ ప్రశ్నకు బదులు చెప్పడం చాలా కష్టం. నాకెంతో ఇష్టమైన మానుషి చిల్లర్‌ను ఫినాలేలో కలిశాను. అదే విధంగా నాకు ప్రియాంకా చోప్రా అంటే ఎంతో ఇష్టం. ఆమె నుంచి స్ఫూర్తి పొందాను. వీలున్నప్పుడు సినిమాలు చూస్తుంటా. బాలీవుడ్‌లో తెరకెక్కిన పలు చిత్రాలు ఇప్పటికే చూశాను. అలియాభట్ నాకు తెలుసు. ఆమె నటించిన 'గంగూబాయి కాఠియావాడి' నాకెంతో నచ్చింది. ప్రేక్షకులను ఆలోచింప చేసే చిత్రమది. 'బాహుబలి' సినిమా గురించి విన్నాను. కానీ, ఆ సినిమా ఇంకా చూడలేదు. మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా కొన్నిరోజుల క్రితం మేమంతా హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీ సందర్శించాం. పోటీలు పూర్తైన తర్వాత తప్పకుండా ఆ సినిమా చూడాలని నాకు నేనే ప్రామిస్ చేసుకున్నా. మళ్లీ నేను ఇక్కడికి వచ్చే నాటికి తప్పకుండా ఆ సినిమాపై రివ్యూ ఇస్తా" అని ఆమె చెప్పారు.అనంతరం కిరీటాన్ని గెలుపొందడాన్ని ఉద్దేశిస్తూ.. "ఇది నా జీవితంలో ఒక అద్భుతమైన రోజు. వ్యక్తిగతంగానే కాకుండా థాయ్‌లాండ్ ప్రజలకూ ఇదొక మైలు రాయి అనే చెప్పాలి. నేనెంతో గర్వపడుతున్నా. మిస్ వరల్డ్ స్టేజ్‌పై మా దేశానికి గుర్తింపు లభించింది. మా దేశానికి ఇదే తొలి విజయం. ఇలాంటి ఒక రోజు కోసం మేమంతా 70 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. ఈ ప్రయాణం క్లిష్టమైనదని నేను చెప్పను. ఎందుకంటే, మన హృదయానికి చేరువైన దానిని పొందేందుకు వేసే ప్రతి అడుగుకు ఒక అర్థం ఉంటుంది" అని ఆమె వివరించారు.

# హిట్ మూవీ సీక్వెల్.. ఆఫర్ నేనే వదులుకున్నా: ఇలియానా



ఒకానొక సమయంలో దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుని అనంతరం బాలీవుడ్‌లో పలు సినిమాల్లో యాక్ట్ చేశారు నటి ఇలియానా.గత కొంతకాలంగా ఆమె సినిమాలకు దూరంగా ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటించారు. నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. ఇందులో భాగంగా ఓ నెటిజన్.. ఆమె నటించిన ఓ హిట్ మూవీ సీక్వెల్ గురించి ప్రశ్నించాడు. దానిపై ఆమె స్పందించారు. సీక్వెల్‌లో నటించే అవకాశం తొలుత తనకే వచ్చిందని.. కాకపోతే తానే దానిని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు."మేడమ్.. 'రైడ్ 2' సినిమాలో మీరెందుకు నటించలేదు? మీ కమ్‌బ్యాక్ ఎప్పుడు ఉంటుంది?" అని నెటిజన్ అడగ్గా.. "సినిమాలను నేనెంతో మిస్ అవుతున్నా. నాక్కూడా ఆ సినిమాలో భాగం కావాలనిపించింది. 'రైడ్' నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. మాలిని పాత్రలో మరోసారి ఒదిగిపోవాలనుకున్నా. మా దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా, నటుడు అజయ్ దేవ్‌గణ్‌తో కలిసి వర్క్ చేయాలని నాక్కూడా ఉంది. నిజం చెప్పాలంటే, సీక్వెల్ తెరకెక్కించాలనుకున్నప్పుడు టీమ్ నన్ను సంప్రదించింది. మళ్లీ యాక్ట్ చేయమని అడిగింది. కాకపోతే, అదే సమయంలో నాకు బాబు పుట్టాడు. దానివల్ల నా ప్రాధాన్యతలు మారిపోయాయి. 'రైడ్ 2' ప్రమోషన్స్‌లో వాణి కపూర్ ఎంతో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఈ పాత్రకు ఆమె కూడా ప్రత్యేకతను తీసుకువచ్చే ఉంటుందని నమ్ముతున్నా" అని ఇలియానా చెప్పారు. "భవిష్యత్తులో సినిమాల్లోకి వచ్చే అవకాశం ఉందా?" అని మరో నెటిజన్ ప్రశ్నించగా.. తప్పకుండా వస్తానని బదులిచ్చారు.2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తితో ఇలియానా వివాహం జరిగింది. అదే ఏడాది ఒక బాబుకు ఆమె జన్మనిచ్చారు. "గర్భం ధరించాకా పనిచేయాలనుకున్నా.. కానీ ఈ సమయంలో తలెత్తిన కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చింది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో మా అమ్మ, నా భర్త మైఖేల్ నాకు అండగా నిలిచారు. ఈ సమస్యల నుంచి బయటపడే ధైర్యాన్ని నాలో నింపారు" అని గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అజయ్ దేవ్‌గణ్ - ఇలియానా జంటగా నటించిన 'రైడ్' 2018లో విడుదలై విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్‌గా నిర్మించిన 'రైడ్ 2' మే ఆరంభంలో విడుదలైంది.




# ఆస్కార్ దర్శకుడి సినిమాలో?

అందం, అభినయంతో బాలీవుడ్ కుర్రకారుని ఉర్రూతలూగించే కథానాయిక దిశా పటాని. ఇటీవలే 'కంగువా' అనే తమిళ చిత్రంలో మెరిసిన ఆమె.. ఇప్పుడు హాలీవుడ్‌లో తొలి అడుగు వేయడానికి సిద్ధమైంది. 'ది యూజువల్ సస్పెక్ట్', 'హౌస్ ఆఫ్ కార్డ్స్' లాంటి హిట్ చిత్రాలతో మెప్పించిన నటుడు, దర్శకుడు.. ఆస్కార్ అవార్డు గ్రహీత కెవిన్ స్పేసీ తెరకెక్కిస్తున్న ఓ సినిమాలో దిశ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. "ఈ ఏడాది ప్రారంభంలోనే మెక్సికోలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించింది దిశ. సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోన్న ఈ చిత్రంలో ఆమె మునుపెన్నడూ నటించని పాత్రలో కనిపించనుంది. 20ఏళ్ల తర్వాత ఈ సినిమా కోసం మళ్లీ మెగా ఫోన్ పట్టారు కెవిన్. దీనికి 'హోలీ గార్డ్స్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఇందులో హ్యారీ గుడ్విన్స్ కీలక పాత్ర పోషిస్తున్నారు. త్వరలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని దిశ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# సెలబ్రేటింగ్.. ది సోల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్




డైరెక్టర్ శేఖర్ కమ్ముల సినీ ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో మెగాస్టార్ చిరంజీవిని కలిశారు శేఖర్ కమ్ముల. ఈ నేపథ్యంలో '25 ఇయర్స్ ఆఫ్ శేఖర్ కమ్ముల.. సెలబ్రేటింగ్ ది సోల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్' పోస్టర్‌ని చిరంజీవి లాంచ్ చేసి ఆయన్ని అభినందించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శేఖర్ కమ్ముల "టీనేజీలో ఒక్కసారి చిరంజీవి గారిని దగ్గరగా చూశాను.'ఈయనతో సినిమా తీయాలి' అనే ఫీలింగ్. అంతే. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఇయర్స్ . ఈ సందర్భంగా కొన్ని జనరేషన్స్‌ను ఇన్‌స్పైర్ చేసిన చిరంజీవి గారిని కలవాలని అనిపించింది. ఈ మూమెంట్‌లోనే కాదు, నా టీనేజ్ నుండి మీరు నా ముందు ఇలాగే ఉన్నారు.' అని శేఖర్ కమ్ముల పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన.. ధనుష్, నాగార్జున హీరోలుగా 'కుబేర' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జూన్ 20న విడుదల కానుంది.



# కథ కుదిరిందా!

'96', 'సత్యం సుందరం' లాంటి బలమైన భావోద్వేగాలు నిండిన చిత్రాలతో సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్. ఇప్పుడాయన తన తదుపరి చిత్రం కోసం సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కథానాయకుడు విక్రమ్‌కు కథ చెప్పి.. ఒప్పించినట్లు సమాచారం. ఇది కూడా ప్రేమ్ శైలికి తగ్గట్లుగా బలమైన భావోద్వేగాలతో నిండిన చిత్రంగానే ముస్తాబు కానుందని.. ప్రస్తుతం ఆయన పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారని.. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది ఇది సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని తెలిసింది. విక్రమ్ ప్రస్తుతం తమిళంలో మడోన్ అశ్విన్‌తో ఓ చిత్రం చేయనున్నారు.

# కాలమే అన్నింటినీ బయటపెడుతుంది

## - రాజ్ నిడిమోరు సతీమణి పోస్ట్



బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు సతీమణి శ్యామాలి ఇటీవల వరుస సందేశాత్మక పోస్టులతో వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె కర్మ సిద్ధాంతాన్ని ఉద్దేశించి ఒక ఆసక్తికర పోస్ట్ షేర్ చేశారు. కాలం అన్నింటినీ బయటపెడుతుందని అందులో రాసి ఉండటం ఇప్పుడు చర్చకు దారి తీసింది. "కాలం అన్నింటినీ బయటపెడుతుంది.. కర్మ సమాధానం చెబుతుంది. ఈ విశ్వం దీనిని నిశితంగా చూస్తుంటుంది" అని రాసి ఉన్న సందేశాన్ని ఆమె ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. దీనికి ఆమె కర్మ, నువ్వు ఏం ఇస్తావో అదే నీకు తిరిగి వస్తుంది అనే హ్యాష్‌ట్యాగ్స్‌ను జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. శ్యామాలి సందేశం వెనుక సారాంశం ఏమై ఉంటుందా అని పలువురు మాట్లాడుకుంటున్నారు.2015లో రాజ్ నిడిమోరుతో శ్యామాలి వివాహం జరిగింది. వివాహం తర్వాత రాజ్ రూపొందించిన చిత్రాలకు ఆమె క్యాస్టింగ్‌లో సాయం చేస్తుండేవారు. ఇదే విషయాన్ని ఆయన గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. రాజ్ - శ్యామాలి విడిపోతున్నారంటూ కొన్ని రోజుల క్రితం వార్తలు కూడా వచ్చాయి. ఆయా కథనాలను ఉద్దేశించి వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు. మరోవైపు, రాజ్– డీకే సంయుక్తంగా తెరకెక్కించిన 'ది ఫ్యామిలీమ్యాన్ సీజన్ 2', 'సిటడెల్: హనీ బన్నీ'లో సమంత నటించారు. ఆయా ప్రాజెక్ట్‌లు చేస్తున్నప్పుడు రాజ్ - సమంత మధ్య పరిచయం ఏర్పడింది. సమంత నిర్మాతగా వ్యవహరించిన తొలి ఫీచర్ ఫిల్మ్‌కు రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా పని చేశారు. సినిమా ప్రమోషన్స్‌లోనూ వీరిద్దరూ కలిసి కనిపించారు. దీంతో వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతుంది. ఈ వారం తనకు ఎలా గడిచిందో తెలియజేస్తూ సమంత శనివారం కొన్ని ఫొటోలు, వీడియోలు పంచుకున్నారు. ఇందులో ఆమె జిమ్‌లో వర్కౌట్లు, రాజ్‌తో కలిసి పికిల్ బాల్ గేమ్ ఆడుతూ కనిపించారు. సామ్ ఫొటోలు పెట్టిన సమయంలోనే శ్యామాలి